

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి స్వాగతం పలుకుతున్న గుడాడ్‌పల్లి గ్రామస్తులు



గండ్ర దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ శోభ, సర్పంచ్ లక్ష్మి దంపతులు

# బీఆర్‌ఎస్‌దే విజయం

- **గెలుపును ఏ శక్తీ ఆపలేదు**
- **ఢిల్లీ గులాంల మాటలు ప్రజలు నమ్మరు**
- **భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి**
- **నియోజకవర్గమే మా కుటుంబం : గండ్ర జ్యోతి**
- **డబుల్ బెడ్‌రూం ఇండ్లలో గృహప్రవేశం చేసిన గుడాడ్‌పల్లి వాసులు**
- **ఎన్నికలు ఏవైనా గండ్ర వెంటే మేమంతా : గ్రామస్తులు**

జయశంకర్ భూపాలపల్లి. అక్టోబర్10 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తీ ఆపలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లిలో ఇటీవల 40 డబుల్‌బెడ్‌రూం ఇండ్లను గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయగా వారు గృహ ప్రవేశం చేశారు. కాగా, మంగళవారం భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ఆయన సతీమణి గండ్ర జ్యోతిని గ్రామస్తులు ఆహ్వానించి కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన గండ్ర దంపతులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ పిలిచి బొట్టు పెట్టి శాలువాతో సన్మానించారు. అనంతరం సర్పంచ్ ఉడుత లక్ష్మీ ఐలయ్య యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో గండ్ర మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమైందని అన్నారు. ఢిల్లీ గులాంలు ఏం చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే మాకు శ్రీరామ రక్ష అన్నారు. భూపాలపల్లిలో కేసీఆర్, కేటీఆర్ సహకారంతో ఊహించని విధంగా అభివృద్ధి చేసి చూపించానని, ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రతి మహిళకు కుట్టు మిషన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్ అందించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. గుడాడ్‌పల్లిలో 40 డబుల్‌బెడ్ రూంలు ఇచ్చామని, వారు ఇండ్లలోకి వెళ్లి ఉంటున్నారన్నారు. గ్రామస్తులు తనను పిలిచి కృతజ్ఞత సభ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గండ్ర జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గమే తమ కుటుంబంగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామన్నారు. భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గ రూపు రేఖలు మారుస్తామన్నారు.

**గండ్ర వెంకటరమణారెడ్డికే మా ఓటు**

'ఎన్నికలు ఏవైనా సరే మేం బీఆర్ఎస్ వెంటే ఉంటాం.. కారు గుర్తుకే మా ఓటు.. ఏ పార్టీలకు ఇక్కడ చోటు లేదు.. మా ఓటు గండ్ర వెంకటరమణారెడ్డికే' అని గుడాడ్‌పల్లి గ్రామస్తులు కృతజ్ఞత సభలో గండ్రకు హామీ ఇచ్చారు. ఆది నుంచి మా గ్రామం బీఆర్ఎస్ వెంటే ఉంటున్నదని, ఇప్పుడు కూడా మీ వెంటే ఉంటామని నినాదాలు చేస్తూ స్పష్టం చేశారు. తమ గ్రామానికి చెందిన జడ్పీ చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతిరావు, సర్పంచ్ ఉడుత లక్ష్మీ ఐలయ్య యాదవ్ తమ వెట ఉండి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. వారు లేకపోతే గ్రామం ఇంత అభివృద్ధి జరిగేది కాదన్నారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్‌పర్సన్ దంపతులు, సర్పంచ్ దంపతులు గండ్ర రమణారెడ్డి, జ్యోతికి తిలకం దిద్ది బట్టలు పెట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వప్నా వెంకటేశ్, ఎంపీటీసీలు సంధ్య, రజిత, సర్పంచులు కమలాభాయి వెంకన్న, శంకరయ్య, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పాలకుర్తి రఘుపతిగౌడ్, నాయకులు పసుల రమేశ్ పాల్గొన్నారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఐటీడీఏ పీవో అంకిత్

ములుగురూరల్, అక్టోబర్10 :ములుగు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఐటీడీఏ పీవో అంకిత్ నియామకం అయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అథితి గృహంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ఏర్పాటు చేసిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలు కనిపించకుండా స్టిక్కర్లను అంటించారు. అలాగే ప్రభుత్వ అంబులెన్స్‌లు, ఇతర వాహనాలపై ఉన్న రాజకీయల పార్టీల నాయకుల చిత్రాలతో పాటు పేర్లను కనిపించకుండా స్టిక్కర్లు వేశారు.



అంబులెన్స్‌కు ఉన్న మోదీ ఫొటోపై స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది

## లక్ష్మీబ్యారేజ్‌కు తగ్గిన వరద

**ఇన్‌ఫ్లో 22,320, అవుట్ ఫ్లో 6,580 క్యూసెక్కులు**

మహదేవపూర్, అక్టోబర్ 10 : లక్ష్మీబ్యారేజ్‌కు వరద ప్రవాహం తగ్గింది. మంగళవారం బరాజ్ ఇన్‌ఫ్లో 22,320 క్యూసెక్కులు రాగా 85 గేట్లకు గాను ప్రస్తుతం 2 గేట్లు ఎత్తి 6,580 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు భారీ నీటిపారుదల శాఖ డీఈఈ సురేశ్ తెలిపారు. బరాజ్ నిల్వ సామర్థ్యం 16.17 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.612 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుత నీటి మట్టం 4.10 మీటర్లుగా ఉందని ఆయన తెలిపారు.



పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతి, పక్కన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్

## అభివృద్ధిని చూసే చేరికలు

- **సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల్లో ప్రగతి**
- **ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్ చేశాం**
- **మండలకేంద్రంలో ఫైర్ స్టేషన్ ప్రారంభించాం**
- **జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి**
- **బీఆర్ఎస్‌లో తాడ్వాయి కాంగ్రెస్ సింగిల్ విండో చైర్మన్, కాటాపురం బీజేపీ వార్డు సభ్యుడి చేరిక**

ములుగు, అక్టోబర్10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసే ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని జడ్పీచైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మంగళవారం తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ సింగిల్ విండో చైర్మన్ పాలకుర్తి రజితా రవీందర్, కాటాపురం గ్రామ బీజేపీకి చెందిన 1వ వార్డు సభ్యుడు ముత్యాల ప్రకాశ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాగజ్యోతి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో ములుగు జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇందులో భాగంగానే ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్‌గా చేయడంతో పాటు మండలకేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌కో చైర్మన్ వై సతీశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తాడ్వాయి మాజీ జడ్పీటీసీ ఆర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణ

- **కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు**
- **ములుగు జిల్లాలో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు**
- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**

ములుగుటౌన్, అక్టోబర్10 : ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణు గోపాల్‌తో కలిసి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ నవంబర్ 3న వస్తుందని, నవంబర్ 3 నుంచి నవంబర్ 10 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 13 వరకు నామినేషన్ల స్క్రూటినీ, 15 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు, నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. ములుగు నియోజకవర్గంలోని 303 పోలింగ్ కేంద్రాల్లో వసతులు, ఎన్నికల తనిఖీ బృందాల ద్వారా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌లో 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సివిజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ములుగు నియోజకవర్గంలో 2వ ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 2,20,886 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. జాబితాలో పేరు లేని వారు అక్టోబర్ 30 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 303 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు, నాయకులు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించొద్దని సూచించారు. ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో సర్వేలెన్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ బృందాలు, ఎంసీఎంసీ కమిటీ, ఎంసీసీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరణకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సి –విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేసుల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నంబర్, ఎవరు ప్రింట్ చేయమన్నారు, వారి ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని, ఈ అంశాలపై అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సమాచారం ఇచ్చినట్లు కలెక్టర్ వివరించారు. 1 పర్మినెంట్, 7 టెంపరరీ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డీపీఆర్వో భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, ఎంఎంసీ సెల్, డిస్ట్రిక్ట్ కంప్లైంట్స్ మానిటరింగ్ కంట్రోల్ రూంను కలెక్టరవ ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఆర్వో రఫిక్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఎలక్షన్ సెల్ డీటీలు విజయ్‌కుమార్, అనిస్ ఫాతిమా, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు.



డిస్ట్రిక్ట్ కంప్లైంట్స్ మానిటరింగ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి